క్లుప్తంగా

ఏపీఎం పోస్టు ఖాళీ


ఐకేపీ కార్యాలయంలో ఖాళీగా ఏపీఎం కుర్చీ

పాలసముద్రం: మండలంలోని ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం లేకుండా డ్వాక్రా సంఘాల అభివృద్ధి కుంటుపడుతోంది. గత ఏపీఎం ఫరీద్ మస్తాన్ అధికార కూటమి నాయకులు, టీడీపీలోనే ఇసుక బకాసురుల బెదిరింపులు తట్టుకోలేక జీడీ నెల్లూరు మండలానికి బదిలీపై వెళ్లిపోయారు. ఇద్దరు సీసీల్లో ఒకరు బదిలీపై పోయారు. అప్పటి నుంచి పాలసముద్రం మండలానికి ఏపీఎంగా వచ్చినవారు లేదు. డ్వాక్రా సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి వంటి రుణాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొంత మంది మహిళలు ఐకేపీ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి ప్రైవేటు సంస్థల్లో రుణాలు తీసుకుంటున్నారు. ఇప్పటికైనా పాలసముద్రం ఐకేపీ కార్యాలయానికి ఏపీఎంను నియమించాలని డ్వాక్రా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

ప్రణాళికాబద్ధంగా బోధన ఉండాలి


ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న ఎంఈఓ

నగరి: ప్రణాళికాబద్ధంగా బోధన ఉండాలని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. శనివారం మండలంలోని వేలావడి ఉర్దూ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యా సంవత్సరంలో చేపట్టాల్సిన కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ


పూజా కార్యక్రమంలో అధ్యాపక బృందం

పుత్తూరు: పట్టణంలోని పిల్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రాణప్రతిష్ట చేశారు. కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ కుమార్ మాట్లాడుతూ హైకోర్టు రిటైర్డ్ జడ్జి శేషాద్రినాయుడు, కళాశాల మెకానికల్ హెడ్ కిషోర్‌కుమార్ సంయుక్తంగా కళాశాలకు చదువుల తల్లి సరస్వతీదేవి విగ్రహాన్ని అందించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్ఓడీ వేలాయుధాచారి, రామకృష్ణ, చంద్రకాంత్, హరీష్, వెంకటేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

శ్రీరంగరాజపురం: గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్‌మురళి అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులను గుర్తించి భూమి పూజ నిర్వహిస్తామన్నారు. శనివారం వెంకటాపురం గ్రామంలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, పుల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ.5 లక్షలు, మూలూరు గ్రామంలో డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.15 లక్షలు, పిళ్లారికుప్పం సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.7 లక్షల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ నిర్వహించామన్నారు. త్వరగా పనులను పూర్తి చేయాలన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు నగరి విద్యార్థి


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థితో కరస్పాండెంట్, హెచ్ఎం

నగరి: తిరుపతిలో శనివారం జరిగిన జిల్లాస్థాయి అండర్-14 చెస్ పోటీల్లో నగరి అవర్ లేడీ ఆఫ్ మెర్సీకి చెందిన విద్యార్థి ఎం.రిషి ప్రతిభ కనబరచి ద్వితీయ స్థానం పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఎంపికైన విద్యార్థిని, పీఈటీ గోపిని పాఠశాల కరస్పాండెంట్ ప్రభా, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

వివరాలు సమర్పించాలి

నగరి: 2011 సంవత్సరం నుండి పదవీ విరమణ పొందిన ఉద్యోగులంతా తమ వివరాలను వెంటనే రిటైర్డ్ ఉద్యోగ సంఘ కార్యాలయంలో సమర్పించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నగరి యూనిట్ కార్యదర్శి ఓ.బాలసుబ్రమణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవీ విరమణ అనంతరం తాము తీసుకున్న కమ్యూటేషన్ మొత్తాన్ని 15 సంవత్సరాల వరకు నెలనెలా మినహాయిస్తున్నారని తెలిపారు. అయితే హర్యానా రాష్ట్రంలో ఉద్యోగులు ప్రభుత్వంపై హైకోర్టుకు వెళ్లి తమకు కేవలం 12 సంవత్సరాల వరకు మాత్రమే మినహాయించాలని కేసు వేయగా కోర్టు ఉద్యోగులకు అనుకూలంగా తీర్పు వెలువరించిందన్నారు. అదే పంథాలో తెలంగాణాలో కూడా తీర్పు ఇచ్చిందని, మన రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగులు కూడా కోర్టుకు వెళ్లేందుకు సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రభుత్వాలు మారుతున్నా అభివృద్ధి అనేది నిరంతరం కొనసాగాల్సిన ప్రక్రియ. అప్పుడే గ్రామం, రాష్ట్రం, దేశం అభివృద్ధి పథాన పయనిస్తాయి. అయితే ప్రస్తుత రాజకీయాలు ఇందుకు అవరోధాలుగా నిలుస్తున్నాయి. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రస్తుత ప్రభుత్వం పక్కన పెట్టేయడం షరా మామూలుగా మారుతోంది. ఇందుకు పుత్తూరు పట్టణంలో కోట్ల రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు నాలుగు నెలలుగా నిలిచిపోవడమే నిదర్శనం.

– పుత్తూరు

అభివృద్ధి ఆగింది

- ప్రభుత్వం మారడంతో ఆగిన పనులు
- పనులు పూర్తి కాకుండానే.. శిథిలావస్థకు భవనాలు
- వృథా అవుతున్న రూ.కోట్ల ప్రభుత్వ ధనం
- ఆర్థికంగా చితికిపోతున్న కాంట్రాక్టర్లు


నిలిచిపోయిన అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులు


డీఎస్పీ కార్యాలయం

పుత్తూరు పట్టణంలో కోట్ల రూపాయలతో వివిధ దశల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణ పనులు ప్రభుత్వం మారడంతో పూర్తిగా ఆగిపోయాయి. వీటిలో పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయం, అర్బన్ హెల్త్ సెంటర్, చిల్డ్రన్స్ పార్క్, శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి పుష్కరిణి తదితర పనులు ఉన్నాయి.

డీఎస్పీ కార్యాలయం

మాజీ మంత్రి ఆర్కే రోజా కృషి ఫలితంగా పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయం రూ.1కోటితో మంజూరైంది. ఇటీవల జరిగిన జిల్లాల పునర్విభజనలో పుత్తూరు మండలం తిరుపతి జిల్లాలో కలవడంతో పోలీస్ సబ్ డివిజన్‌ను రేణిగుంట డివిజన్‌లోకి విలీనం చేశారు. అప్పటికే భవన నిర్మాణ పనులు జరుగుతుండడంతో మంత్రి రోజా చొరవ తీసుకొని పోలీస్ సబ్ డివిజన్ ప్రాముఖ్యతను అప్పటి ప్రభుత్వానికి నివేదించారు. డీఎస్పీ కార్యాలయాన్ని తిరిగి పుత్తూరులోనే నిలబెట్టగలిగారు. ప్రస్తుతం 75 శాతం పనులు పూర్తయిన నేపథ్యంలో పనులు ఆగిపోయాయి. పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని పోలీసు వర్గాలతో పాటు, ప్రజలు కోరుతున్నారు.

రూ.80 లక్షలతో అర్బన్ హెల్త్ సెంటర్

ప్రతి ఇంటికి ప్రభుత్వ వైద్యం నినాదంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసింది. ఇందులో భాగంగా నాటి ప్రభుత్వం ప్రతి పట్టణానికి ఒక అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంజూరు చేసింది. అయితే అప్పటి మంత్రి ఆర్కే రోజా అభ్యర్థన మేరకు పుత్తూరుకు రెండు అర్బన్ హెల్త్ సెంటర్లను మంజూరు చేశారు. గత ఫిబ్రవరి 21న మంత్రి రోజా గోవిందపాళెం వద్ద రూ.80 లక్షలతో ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. కళ్యాణపురం వద్ద మరో రూ.80 లక్షలతో నిర్మిస్తున్న సెంటర్ దాదాపు పనులు పూర్తి కావస్తున్నాయి. ఈ నేపథ్యంలో పనులు ఆగిపోయాయి. రెండో హెల్త్ సెంటర్ సైతం అందుబాటులోకి వస్తే మెరుగైన వైద్య సేవలు అందుతాయని పట్టణ ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

చిల్డ్రన్స్ పార్క్

స్థానిక లక్ష్మీనగర్‌కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో తుడా నిధులతో చిల్డ్రన్ పార్క్ నిర్మాణానికి అప్పటి మంత్రి ఆర్కే రోజా తగిన కార్యాచరణ పూర్తి చేశారు. ఇందులో భాగంగా తుడా అధికారుల సూచన మేరకు మున్సిపల్ నిధులు రూ.24 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను సైతం ప్రారంభించారు. అయితే ప్రభుత్వం మారడంతో కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు పునాదుల దశలోనే ఆగిపోయాయి. పట్టణంలో ఇలా ఆగిన అన్ని అభివృద్ధి పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



రూ.30 లక్షలతో పుష్కరిణి

పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వర స్వామి ఆలయానికి చెందిన పుష్కరిణి ఆధునికీకరణ పనులు గత ప్రభుత్వంలో ప్రారంభించారు. పుష్కరిణి పునర్నిర్మాణానికి అప్పటి మంత్రి ఆర్కే రోజా దేవదాయ శాఖ ద్వారా రూ.25 లక్షలు మంజూరు చేయించారు. ప్రజలు ఇచ్చిన రూ.5 లక్షల విరాళాలతో కలిపి మొత్తం రూ.30 లక్షలతో పనులు ప్రారంభమయ్యాయి. గతంలో కోనేరు చుట్టూ వ్యాపారాలు చేసుకుంటున్న వారి కోసం, ప్రజల భాగస్వామ్యంతో రూ.60 లక్షల అంచనా వ్యయంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని సైతం చేపట్టారు. అయితే దీనిపై తెలుగుదేశం పార్టీ నాయకులు కోర్టు ద్వారా స్టే తెచ్చి పనులు నిలిపేశారు. దీంతో పుష్కరిణి పనులు సైతం ఆగిపోయాయి. పుష్కరిణి ప్రారంభమైతే పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుందని భావించిన ప్రజల ఆశలు గల్లంతయ్యాయి.



బలరామిరెడ్డి కుటుంబానికి భరోసా

వెదురుకుప్పం: మండలంలోని కొమరగుంట పంచాయతీ గోవిందవారిపల్లె గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త బలరామిరెడ్డి కుటుంబానికి స్నేహితులు భరోసా ఇచ్చారు. మానవతా దృక్పథంలో ఇంటర్ బ్యాచ్ మిత్రులు ఆర్థిక సాయం అందజేశారు. శనివారం గ్రామంలో పర్యటించిన బాల్య మిత్రులు బాధితురాలి ఇంటికి వెళ్లి కలిసి రూ.71 వేలు ఆర్థిక సాయం చేసి ఆ కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. వెదురుకుప్పం జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో చదివిన విద్యార్థులు బలరామిరెడ్డి మరణానికి చింతిస్తూ తమ వంతు సహాయం అందించడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ అన్నారు. భవిష్యత్తులో కూడా బాధిత కుటుంబానికి అన్నివిధాలా తోడుగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నామంటూ గుండె ధైర్యాన్ని ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హుమేష్, చిట్టి, వెంకటేశ్ పాల్గొన్నారు.


ఆర్థిక సాయం చేస్తున్న మిత్రులు

ఆస్పత్రి అదనపు భవన నిర్మాణ పూర్తి చేయాలి


భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్ అధికారులు

పాలసముద్రం: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో నిర్మిస్తున్న అదనపు భవన నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఎస్ఈ శంకరనాయణ ఆదేశించారు. శనివారం పీహెచ్‌సీ పక్కన నిర్మిస్తున్న పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని ఆయన క్షేత్రస్థాయిల్లో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గతంలో పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాల పనులను వచ్చే నెల 25వ తేదీలోగా పూర్తి చేసి వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈ ఆనందరెడ్డి, ఎంపీడీఓ విద్యావతి, ఇంజినీర్ అసిస్టెంట్ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ హైవే పనులకు కలిగించొద్దు

బంగారుపాళెం: మండలంలో జరుగుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనులకు ఆటంకం కలిగించవద్దని జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. శనివారం మండలంలోని బలిజపల్లె వద్ద ఎక్స్‌ప్రెస్ హైవే రింగ్ రోడ్డు పనులను హైవే సిబ్బంది చేపట్టారు. రింగ్‌రోడ్డు నిర్మాణ స్థలంలో ఉన్న కళాగ్రాండ్ హోటల్ వద్ద హైవే సిబ్బంది పనులు చేపట్టారు. అయితే యజమాని అభ్యంతరం వ్యక్తం చేసి పనులు చేయరాదంటూ అడ్డుకునే ప్రయత్నం చేశారు. హైవే అధికారులు సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జేసీ బలిజపల్లెలో జరుగుతున్న హైవే పనులను పరిశీలించారు. రింగ్ రోడ్డు పనులు జరిగే స్థలంలో గల హోటల్‌ను జేసీ పరిశీలించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ చెన్నై నుంచి బెంగళూరు వరకు ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనులను చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా భూములు ఇచ్చిన వారికి ప్రభుత్వం పరిహారం అందించిందన్నారు. అందులో భాగంగా బలిజపల్లె వద్ద రింగు రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆ స్థలంలో కళాగ్రాండ్ హోటల్ ఉందన్నారు. సదరు హోటల్ యజమానికి ప్రభుత్వం 2022లో నష్టపరిహారం కింద నగదు చెల్లించడం జరిగిందని, ఆ స్థలాన్ని స్వాధీనం చేసిన అంగీకారపత్రాన్ని సైతం రెవెన్యూ అధికారులకు అందజేశారన్నారు. గతేడాది హోటల్ ఖాళీ చేయాలని చెప్పినా, చేయలేదన్నారు. 2025 నాటికి ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా సంబంధిత యజమానులతో మాట్లాడి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకరించాలని కోరామన్నారు. ఈ నెల 22వ తేదీలోపు హోటల్‌ను ఖాళీ చేయాలని సదరు కళాగ్రాండ్ హోటల్ యజమానికి సూచించారు. హైవే నిర్మాణ పనులకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రతి రోగికి వైద్యసేవలు

గుడిపాల: ప్రతి ఇంటి ముంగిటకు వెళ్లి, ప్రతి రోగికి వైద్యసేవలు అందజేయడం జరుగుతుందని వైద్యాధికారి సంధ్య అన్నారు. శనివారం పెద్దిశెట్టిపల్లెలో 104 వాహన సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోనే ప్రతి ఇంటి ముంగిటకు వైద్యసేవలను అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం 67 మంది రోగులకు బీపీ, షుగర్, గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. గ్రామంలో మంచం పట్టిన రోగులకు ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలు చేశారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది తేజ, ఇందుమతి, చంద్రశేఖర్, నిరోష, నరసమ్మ పాల్గొన్నారు.

ఇతరుల బాధ మనదనుకోవాలి


మాట్లాడుతున్న గరికపాటి రమేష్‌బాబు


విరాళం అందిస్తున్న మునిరాజులశెట్టి

పుత్తూరు: ఇతరుల బాధను మనదిగా భావిస్తే అక్కడే భగవంతుడు ఉన్నట్లని ఎస్వీయూ తెలుగు పరిశోధనా పండితుడు గరికపాటి రమేష్ బాబు తెలిపారు. ప్రకృతిలో పక్షులు, పశువులు, వృక్షాలు బతికున్నంత కాలం నిస్వార్థంగా ఫలాలను అందిస్తున్నాయని తెలిపారు. మరణించాక వాటి శరీరాలు సైతం మనకు వివిధ రకాలుగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు. అలాంటిది జ్ఞానవంతులైన మానవులు ఎలా జీవించాలో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గరికపాటి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేస్తే తమ జీవితం అయిపోయిందనుకోరాదని సూచించారు. వృద్ధాప్యంలోనే బంధాలు మరింతగా బలపడుతాయని తెలిపారు. వృద్ధాప్యంలో కావాల్సినంత సమయం ఉంటుందని, చేతనైన సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పుత్తూరు విశ్రాంత ఉద్యోగుల సంఘం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి మార్గదర్శకంగా నిలుస్తోందని కొనియాడారు. మోటివేషన్ వక్త నారాయణరావు వృద్ధాప్య జీవితంపై అవగాహన కల్పించారు. సంఘ భవన నిర్మాణానికి వెటర్నరీ ఆఫీసర్ మునిరాజులశెట్టి రూ.50 వేల విరాళాన్ని సంఘ అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజుకు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత ఆర్సీ కృష్ణస్వామిరాజు, సంఘ నాయకులు గుణశేఖర్‌రెడ్డి, యుగంధర్‌రాజు, రామలింగం, రామ్మూర్తి, కృపావరమ్మ, చంద్రశేఖర్‌వర్మ, కుప్పయ్య, వెంకటకృష్ణమనాయుడు, చిరంజీవి, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఈచనేరిలో వైద్యసేవలు

తవణంపల్లె: వర్షాకాలంలో జ్వరాలు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు నీటిని కాచి చల్లార్చి తాగాలని వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని ఈచనేరిలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. డాక్టర్ వినయ్‌కుమార్ 40 మంది రోగులకు వైద్య సేవలందించారు. గర్భిణులు, బాలింతలు, మహిళలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులు ప్రసవం అయితే తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. గర్భిణులు రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నివారించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

పాలసముద్రం: సమాజంలో మానవ అక్రమ రవాణా నివారించడం అత్యవసరమని ఎస్ఐ భారతి తెలిపారు. శనివారం ఆముదాల గ్రామంలో వాక్ ఫర్ ఫ్రీడం సౌజన్యంతో, రూరల్ యాక్షన్ ఫర్ సోషల్ సర్వీస్ సంస్థ ప్రతినిధి చిట్టిబాబు ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్ఐ భారతి మాట్లాడుతూ మహిళలు జాగ్రత్తగా ఉండాలన్నారు. మహిళల అక్రమ రవాణా నివారణలో ప్రజలను భాగస్వామ్యం చేసుకుని ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం ఎస్ఐ భారతి, చిట్టిబాబు చేతుల మీదుగా కరపత్రాలు విడుదల చేశారు. గంగాధర నెల్లూరు ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీఓ వినితశ్రీ, సూపర్‌వైజర్ అనురాధ, ఆముదాల హైస్కూల్ హెచ్ఎం బాలాజీ నాయుడు, ఏఎస్ఐ రవి, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. ఉచిత బస్సు ప్రయాణం మాట అటుంచితే బస్సుల్లో సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే దడ పుడుతోంది. కాలం చెల్లిన బస్సులు మార్గమధ్యంలో మరమ్మతులకు గురై మొండికేస్తున్నాయి. గ్రామీణ రోడ్లపై నిత్యం ఆర్టీసీ బస్సులు మొరాయిస్తుండడంతో గమ్యం చేరడం గగనమైపోతున్నట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గమ్యం గగనమే...

- మొండికేస్తున్న పల్లె వెలుగు బస్సులు
- డ్రైవర్ల ఫీట్లు.. ప్రయాణికుల పాట్లు
- కండిషన్ లేని బస్సులతో ఇక్కట్లు


రాయల చెరువు సమీపంలో ఆగిపోయిన చిత్తూరు డిపో బస్సు

వెదురుకుప్పం : ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణికులకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుంటున్నా అది కేవలం ప్రకటనలకే పరిమితమవుతోంది. సురక్షిత ప్రయాణం సాగించేందుకు ఆర్టీసీ బస్సులే శ్రేయస్కరమని పదేపదే చెబుతున్నా ఆచరణలో మాత్రం పూర్తిగా విఫలమవుతోంది. ప్రధానంగా గ్రామాల మీదుగా నడుస్తున్న పల్లె వెలుగు బస్సులలో ప్రయాణం రోజురోజుకీ ఇబ్బందికరంగా మారిపోతోంది. బస్సెక్కి ఇల్లు చేరుకోవాలంటే గగనమైపోతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చార్జీల భారాన్ని మోపుతూ ఆర్టీసీ ఆదాయాన్ని పెంచుకుంటున్నా ప్రయాణికులకు భద్రత కల్పించడంలో విఫలమవుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం కండిషన్‌లో ఉన్న బస్సులను గ్రామీణ ప్రాంతాల్లో నడపక పోవడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది.


కాలం చెల్లిన బస్సులు

ఆర్టీసీ బస్సు సర్వీసులు కండిషన్‌లో లేక ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్నాయి. మండలంలో పలు గ్రామాల మీదుగా నడుస్తున్న ఆర్టీసీ బస్సులు 70 శాతం కాలం చెల్లినవి కావడంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. మండలంలో రోజుల వ్యవధిలో తిరుపతి డిపోకు చెందిన మూడు ఆర్టీసీ బస్సులు పచ్చికాపల్లం సమీప ప్రాంతాల్లో వివిధ సాంకేతిక కారణాలతో ఆగిపోయాయి. తిరుపతి నుంచి పళ్లిపట్టుకు వెళ్లే బస్సులు, తిరుపతి నుంచి పెనమూరుకు వెళ్లే బస్సులు, తిరుపతి నుంచి కమ్మపల్లె, పచ్చికాపల్లం మీదుగా గాజంకికి వెళ్లే బస్సులు తరచూ మరమ్మతులకు గురవడంతో మార్గమధ్యలోనే ఆగిపోవాల్సి వస్తోంది. సాంకేతిక లోపాల నేపథ్యంలో డ్రైవర్ల ఫీట్లు అన్నీఇన్నీ కావు

గమ్యం చేరాలంటే నరకం

ఆర్టీసీ బస్సెక్కి ఇంటికి చేరేవరకు ప్రయాణికులు తమ ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణం సాగించాల్సిందే. డొక్కు బస్సులను నడుపుతుండడంతో మార్గమధ్యలోనే నిలిచి పోయి ఇటు ప్రయాణికులకు అటు డ్రైవర్‌లకు కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. ప్రధానంగా వెదురుకుప్పం ప్రాంతాలకు రావాలంటే ఘాట్ రోడ్లు అధికంగా ఉన్నాయి. కార్వేటినగరం సమీపంలోని పెద్ద కనుమ, చిన్నకనుమ, తిరుపతికి వెళ్లే రోడ్డులో రాజబావి కోన వద్ద బస్సులు తరచూ నిలిచి పోతున్నాయి. సామర్థ్యం లేని బస్సులు కావడంతో కనుమలలోనే నిలిచి పోవడంతో ప్రయాణికుల సహకారంతో బస్సులను పైకి తీసుకొస్తున్నారు. పుత్తూరు డిపోకు చెందిన బస్సులైతే ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తుంటాయి. వెదురుకుప్పం మీదుగా నడిచే పుత్తూరు డిపోకు చెందిన బస్సులు నిత్యం నిలిచి పోతున్నాయి. దీంతో ఇటు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పుత్తూరు, తిరుపతి, చిత్తూరు ప్రాంతాలకు వెళ్లే వారు కాలం చెల్లిన బస్సులతో ప్రయాణం చేయలేక విసిగి వేశారిపోతున్నారు. దీనికన్నా ఆటోలలో ప్రయాణమే నయమని భావిస్తున్నారు. ఆర్టీసీ యాజమాన్యం మాత్రం కనికరం చూపడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

బస్సుల్లో వెళ్లలేకున్నారు



ఆర్టీసీ బస్సుల్లో వెళ్లలేకున్నారు. అసలే అరకొర బస్సులు తిరుగుతున్నాయి. దీనికి తోడు తరచూ మార్గమధ్యలో నిలిచిపోతున్నాయి. సకాలానికి చేరుకోలేకపోతున్నాం. ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రధానంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తిరుపతికి ఉపాధి కోసం వెళ్లే వారికి తీవ్ర అసౌకర్యం ఏర్పడుతోంది. ఆర్టీసీ అధికారులు పట్టించుకోవాలి. – గోవిందన్, బలిజపల్లె

కండీషన్ బస్సులు నడపాలి



కాలం చెల్లిన బస్సులను నడుపుతుండడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. డొక్కు బస్సులే దిక్కుగా ఉంది. ఫిట్‌నెస్ లేని బస్సులను నడుపుతున్నారు. ఒక్క బస్సు కూడా సరైన కండీషన్ లేదు. ఎక్కడ పడితే అక్కడ మొండికేస్తున్నాయి. గమ్యం చేరాలంటే అవస్థలు పడుతున్నాం. ఆర్టీసీ తీరుమారాలి. ఆదాయం మార్గంలో ఆలోచించకుండా ప్రయాణికుల అవస్థలను చూడాలి. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నడపాలి

– అర్జున్, చింతలగుంట

అంగన్‌వాడీల్లో అక్షరాలు నేర్పించాలి

పాలసముద్రం: మండల పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లలకు టీచర్లు తప్పకుండా అక్షరాలు, పాటలు వంటివి నేర్పించాలని సీడీపీఓ వినితాశ్రీ తెలిపారు. మండలంలోని ఆముదాల, రంగాపురం అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. అంగన్‌వాడీ టీచర్‌లతో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లలకు పౌష్టికాహారంతోపాటు మధ్యాహ్నం భోజనం పెట్టాలన్నారు. పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాలు, పాటలు, ఇంగ్లీష్ అక్షరాలు నేర్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులు కొట్టివేతలు లేకుండా ఉండాలని సూచించారు. అనంతరం రంగాపురం అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు పాటలు, తెలుగు, ఇంగ్లీష్ అక్షరాలు నేర్పించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ అనురాధ, కుమారి, జయమ్మ, ఉన్నారు.


చిన్నారులతో మాట్లాడుతున్న సీడీపీఓ వినితాశ్రీ